# అనగనగా... ఒక కథ

# ఘటన

అల్లుడు సాక్షాత్తూ విష్ణుమూర్తి- కూతురు సాక్షాత్తూ లక్ష్మీదేవి అని భావిస్తూ...

వరుడుకి కాళ్లు కడిగి కన్యాదానం చేస్తారు మామగారు.

అదే మంత్రార్థాల మధ్య సంప్ర దాయ ప్రకారంగా పెళ్లిపందిరిలో



ఆ ఆవేశంలో దగ్గు- గుండె గట్టిగా నొక్కి పట్టుకున్నాడు- మనిషికి చెమట్లు పడుతున్నాయి.వాటర్ బాటిల్ కోసం తన లగేజీని వెతుక్కుంటున్నాడు-శేఖర్ కంగారుపడ్డాడు- తన బేగ్‌లోంచి ముందుగా ఓ మాత్ర తీసి అతని నాలిక కింద పెట్టాడుకొంచెం సేపట్లో అతడు కోలుకున్నాడు.మంచినీళ్లు తాగి స్థిమిత పడ్డాడు.

**కాబోతూన్న అల్లుడికి కాళ్లు కడుగుతున్నాడు రాఘవేంద్రరాజు. భార్య సుజాత నీళ్లు పోస్తోంది.**

పురోహితుడు ఏవో మంత్రాలు చదివి తంతుని శాసిస్తున్నాడు. కానీ ఈ కాళ్లు కళ్ల లోంచి పొంగుతూన్న..కన్నీళ్ళతో..రాఘవేంద్ర రాజు మనస్సులో చాలాసార్లు కడిగాడు...చి.శేఖర్‌కి!!

* * *

"కాళ్ళిరగ్గొడతాను- నడు- బైటకి నడు- రైల్లోంచి తోసేస్తే దిక్కూ మొక్కూ లేకుండా చస్తావు" రైల్వే పోలీసు..రాఘవేంద్రరాజు శేఖర్‌ని తిట్లున్న అన్ని భాషల్లో తిడుతున్నాడు- దానికి వత్తాసు పలుకుతున్నాడు..టిక్కెట్ కలెక్టర్- రెండు పులులు ఒక్క లేడి ఆ పరిస్థితి-

"నా మాట వినండి సార్..నాకు ఫైన్ వేయండి..నేను కడతా..బాత్రూం దగ్గరైనా-నించుని ప్రయాణం చేస్తాను-నాది తప్పే- క్షమించండి"

"రిజర్వేషన్ కేబిన్‌లో కన్ఫర్మేషన్ లేకుండా ఎక్కడం- పైగా ఆర్గ్యుమెంట్..ఫైనెయ్యాలో పైకి పంపాలో మేం చూసుకుంటాం"

"పైగా నన్ను ఎదిరించాడయ్యా. టిక్కెట్ కలెక్టర్లంటే ఏమనుకుంటున్నాడు- పదో పరకో పడేస్తే..ఎక్కడో అక్కడ బెర్త్ ఎలాట్ చేస్తాడు అనుకుంటున్నాడు. నేను అలాంటివాణ్ని కాదు నీకు తెల్సుగా.."

"సార్ మీరూరుకోండి- వచ్చే స్టేషన్లో రైలు ఆగగానే మెడపట్టి గెంటేస్తాను. మీరు వర్రీ అవకండి-" టీసీ కోపాన్ని చల్లార్చి-మళ్లీ శేఖర్‌వైపు విజృంభించాడు.

"ఆయన పెద్ద మనిషిరా- ఆయన సర్వీస్ నీ వయస్సంత ఉండదు. ఆయనని డబ్బులు పెట్టి కొనేద్దామనుకుంటున్నావా? అసలు రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లోకి కన్ఫర్మ్ కాకుండా ఎందుకు ఎక్కావ్ రా"

రా-అన్నా, బే-అన్నా, సాలే-అన్నా, ఏమన్నా కోపం రావట్లేదు శేఖర్‌కి. నిజానికి కోపం రాకూడదు అతనికి... మళ్లీమళ్లీ రిక్వెస్ట్ చేస్తూ..."నా మాట వినండి సార్ నేను అర్జెంట్‌గా వెళ్లాలి..మీ కాళ్లు పట్టుకుంటా"- బిక్కచచ్చిపోయి బేలగా అడుగుతున్నాడు శేఖర్.

శేఖర్ బతిమాలిన కొద్దీ పోలీసు జులుం 'రేంజ్' పెరుగుతోంది.

మరో పరిస్థితిలో అయితే శేఖర్ అతన్ని రైల్లోంచి కిందికి తోసేసేవాడే- కానీ ఇప్పుడు అతనున్న స్థితి అంత సాహసం చేయకుండా అణిగిమణిగి ఉండమని హెచ్చరించింది.

"వచ్చే స్టేషన్‌లో దిగిపో-ట్రాక్ పట్టుకుని నడుచుకుంటూ వెళ్తావో- నడుస్తున్న బండిలో జనరల్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కుతూ పడి చస్తావో నీ ఇష్టం- చావకపోతే మా పోలీసులు అరెస్ట్ చేసి చిత్రవధ చేస్తార్లే"

రైల్వేపోలీసు రాఘవేంద్రరాజు రకరకాల స్థాయీ స్వరాల్తో సమాజాన్ని యువతరాన్ని సంఘాన్నీ తిట్టిపోస్తున్నాడు.

ఆవేశంలో ఊగిపోతున్నాడు-

శేఖర్ నిశ్శబ్దంగా భరిస్తున్నాడు-

అతని మౌనం రాఘవేంద్రరాజుకి మరీ అసహనంగా వుంది-

ఇంకా కోపం వస్తోంది! ఇంకా అరుస్తున్నాడు-

ఆ ఆవేశంలో దగ్గు- గుండె గట్టిగా నొక్కి పట్టుకున్నాడు- మనిషికి చెమటలు పడుతున్నాయి.

వాటర్ బాటిల్ కోసం తన లగేజిని వెతుక్కుంటున్నాడు-

శేఖర్ కంగారుపడ్డాడు- తన బేగ్‌లోంచి ముందుగా ఓ మాత్ర తీసి అతని నాలిక కింద పెట్టాడు.

కొంచెం సేపట్లో అతడు కోలుకున్నాడు.

మంచినీళ్లు తాగి స్థిమిత పడ్డాడు.

"నీ దగ్గర ఈ టేబ్లెట్ ఎందుకుంది?"

"మా నాన్నకి ఈ టేబ్లెట్స్ చాలా అవసరం. అక్కడ దొరకట్లేదంటే..ఇవ్వడానికి పట్టికెళ్తున్నాను. ఇదే సార్..నా అర్జెన్సీ కూడాను-అందుకే రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కేసాను-"

రాఘవేంద్రరాజు సిగ్గుతో...చితికిపోతున్నాడు-

"రిజర్వేషన్ లేదంటే జనరల్‌లో టికెట్ తీసుకున్నా- రైలు కదిలిపోతుంటే..చేసేది లేక.."

"ఇక ఏం చెప్పకు బాబూ" అంటూ చేతులు జోడించాడు.

"ఎప్పుడైనా మా ఇంటికిరా- రైల్వే క్వార్టర్స్‌లో.." అంటూ ఎడ్రస్ చెప్పాడు-

* * *

ఆ తర్వాత చాలా రోజులకి శేఖర్... రాఘవేంద్ర రాజు ఇంటికెళ్లే అవకాశం దొరికింది- రాఘవేంద్రరాజు ఇంటిల్లిపాదీ శేఖర్ అంటే గౌరవాదరాలు చూపించారు. దేవుడే తమ ఇంటికి వచ్చాడనుకున్నారు-

అలా చాలాసార్లు వాళ్ల అభిమానాన్ని పొందాక..వాళ్లింటి అల్లుడవడానికి అంగీకారం కుదిరింది.

అల్లుడు సాక్షాత్తూ విష్ణుమూర్తి- మనస్పూర్తిగా కాళ్లు కడిగాడు.

"చచ్చిపో- చావు..చంపేస్తా"నన్న నోటితోనే..దీర్ఘాయుష్మాన్ అని అక్షింతలేశాడు- దీర్ఘసుమంగళీభవ అని దీవించాడు- కన్నీళ్లతో అభిషేకిస్తూ-

దేవుడెన్ని చిత్రాలు చేస్తాడు-

ఆవేళ ట్రైన్‌లో టిక్కెట్ కలెక్టర్ వేషంలో ఉన్న పెద్ద మనిషి రెండు తిరుపతి టిక్కెట్స్ కొని తెచ్చి "కన్ఫర్మ్‌డ్ టిక్కెట్లయ్యా- మీ పెళ్లికి నా కానుక" అన్నాడు.

శేఖర్ చిన్నగా నవ్వాడు-

రాఘవేంద్రరాజు చల్లగా నవ్వి కళ్లు తుడుచుకున్నాడు.

*




